నేరాల అడ్డా హైదరాబాద్

మొదటిపేజీ తరువాయి...

కమాండ్, కంట్రోల్ సెంటర్‌లో ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సీవీ ఆనంద్ మాట్లాడుతూ 2023 చివరలో ఎన్నికలు పూర్తయి, 2024 మార్చిలో పార్లమెంట్ ఎన్నికలు జరగడంతో ఈసీ ఆదేశాల మేరకు అధికారుల బదిలీలు జరిగాయని చెప్పారు. జిల్లాల నుంచి అధికారులు రావడం, వారికి సిటీ పోలీసింగ్‌పై అంతగా పట్టులేకపోవడంతో ఇక్కడి పరిస్థితులను అర్థం చేసుకొనేందుకు కొంత సమయం పట్టిందని తెలిపారు. నిరుడు 25,488 కేసులు నమోదు కాగా ఈ ఏడాది 35,944 కేసులు నమోదయ్యాయని వెల్లడించారు. సైబర్ నేరాలు భారీ స్థాయిలో పెరిగాయని, ఈ ఏడాది 4,042 కేసులు నమోదు కాగా సుమారు రూ.296 కోట్లను సైబర్ నేరగాళ్లు ప్రజల నుంచి కొట్టేశారని తెలిపారు. నేరాల్లో శిక్షల శాతం ఈ ఏడాది 42 శాతం నమోదైందని, నిరుడుకంటే పెరుగుదల ఉన్నదని చెప్పారు. సీసీఎస్‌లో ఈ ఏడాది 248 కేసులు నమోదు కాగా వీటిలో రూ.1,036 కోట్ల విలువైన నష్టం ప్రజలకు జరిగిందని వివరించారు. ట్రాఫిక్ పరిధిలో ఈ ఏడాది 48,81,352 చలాన్లు వేశామని, ఎన్‌ఫోర్స్‌మెంట్ పక్కాగా చేయడంతో రోడ్డు ప్రమాదాల్లో మరణాల సంఖ్య నిరుడు 327 ఉంటే, ఈ ఏడాది 215కు తగ్గిందని వెల్లడించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం, అవినీతి ఆరోపణలు, ఏసీబీకి పట్టుబడ్డ 30 మందిపై వేటు పడిందని తెలిపారు. సమావేశంలో అదనపు సీపీలు విక్రమ్ సింగ్ మాన్, విశ్వప్రసాద్, ఆయా జోన్ల డీసీపీలు పాల్గొన్నారు.

వీడియో చూసి ఆలోచించండి : సీపీ సీవీ ఆనంద్

సంధ్య థియేటర్‌లో తొక్కిసలాటపై విలేకరులు అడిగిన ప్రశ్నలపై సీపీ స్పందిస్తూ ఈ విషయం న్యాయస్థానంలో ఉన్నదని తాము ఎక్కువగా దీనిపై ఏమీ చెప్పలేమన్నారు. సీసీ కెమెరాలు, సోషల్‌మీడియా, మెయిన్ మీడియాలో వచ్చిన వీడియోలతోపాటు ఘటనకు ముందు వెనుక జరిగిన పరిణామాలపై దాదాపు 10 వేల కెమెరాల నుంచి పరిశీలించి 10 నిమిషాల నిడివి కలిగిన వీడియోను రూపొందించామని చెప్పారు. దాన్ని మీడియా ఎదుట ప్రదర్శించారు. ఇది చూసిన వాళ్ల విజ్ఞతకే వదిలేస్తామని, ఇంతకంటే ఎక్కువగా మాట్లాడలేనని చెప్పారు. సినిమా చూస్తున్న నటుడు అల్లు అర్జున్‌కు తొక్కిసలాట గురించి చెప్పారా? అని అడిగిన మరో ప్రశ్నకు తాము విషయం చెప్పామని తెలిపారు. ఈ విషయంపై చిక్కడపల్లి ఏసీపీ రమేశ్ మాట్లాడుతూ తొక్కిసలాట గురించి అల్లు అర్జున్‌కు చెప్పేందుకు వెళ్తుంటే ఆయన మేనేజర్ సంతోష్ అతని వద్దకు వెళ్లనీయలేదని, ఆ తర్వాత తానే వారిని తోసేస్తూ అల్లు అర్జున్ వద్దకు వెళ్లి తొక్కిసలాట జరిగిందని, అక్కడ ఒక మహిళ మృతి చెందిందని, బాబు సీరియస్‌గా ఉన్నాడని చెప్పానని వివరించారు. సినిమా చూసి వెళ్లిపోతానని అల్లు అర్జున్ చెప్పినట్టు తెలిపారు. ఈ విషయాన్ని కింద ఉన్న డీసీపీకి వివరించడంతో ఆయన వచ్చి అల్లు అర్జున్‌కు వివరించి, 10 నిమిషాల్లో అక్కడి నుంచి ఆయనను పంపించారని వివరించారు. చిక్కడపల్లి సీఐ రాజునాయక్ మాట్లాడుతూ రెండు గంటల ముందే సినీ నటుడు అల్లు అర్జున్‌ను రావొద్దని చెప్పాలని థియేటర్ యాజమాన్యానికి చెప్పామని, అయినా భారీ ర్యాలీలో అక్కడకు వచ్చారని తెలిపారు. అర్జున్ రావడంతోనే భారీగా ప్రేక్షకులు గుమిగూడారని, చాలా మంది కింద బాల్కనీలోకి చొచ్చుకెళ్లారని, అక్కడి నుంచి పై బాల్కనీలో ఉన్న అల్లు అర్జున్‌ను కలిసేందుకు ప్రయత్నించారని చెప్పారు. కింద బాల్కనీలో జరిగిన తొక్కిసలాటలో రేవతి, ఆమె కొడుకు అపస్మారక స్థితిలోకి పోవడంతో బయటకు తీసుకొచ్చి సిబ్బంది, ఎస్సై మౌనికతో కలిసి సీపీఆర్ చేశామని వివరించారు.

బంజారాహిల్స్ రోడ్ నంబర్ 10 ప్రధాన రహదారిలో పదిహేను రోజుల క్రితం ప్రభుత్వ స్థలం అని రాసి ఉన్న బోర్డు, ఆదివారం మధ్యాహ్నం బోర్డులు తొలగించిన దృశ్యం

‘ఐదెకరాల’పై అడ్డగోలు వాదనలు

- ‘రాజధాని నడిబొడ్డున బిగ్ స్కెచ్’
- కథనంపై ‘పెద్దల్లో’ ప్రకంపనలు
- ప్రభుత్వ స్థలం ఆక్రమణపై ఉన్నతాధికారుల సీరియస్
- దిద్దుబాటు చర్యలకు రంగం సిద్ధం
- స్థలాన్ని స్వాధీనం చేసుకున్న రెవెన్యూ శాఖ అధికారులు
- తమ ఆధీనంలోనే ఉందన్న తహసీల్దార్

బంజారాహిల్స్, డిసెంబర్ 22: ‘రాజధాని నడిబొడ్డున బిగ్ స్కెచ్’ పేరుతో ‘నమస్తే తెలంగాణ’ ప్రచురించిన కథనం హైదరాబాద్‌లో ప్రకంపనలు సృష్టిస్తున్నది. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 10 ప్రధాన రహదారిపై సుమారు 5 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కాజేసేందుకు ప్రైవేటు వ్యక్తులు చేస్తున్న ప్రయత్నాలపై నమస్తే తెలంగాణ దినపత్రిక వరుస కథనాలు ప్రచురించడంతో ప్రభుత్వం నష్టనివారణ చర్యలు ప్రారంభించింది. ఈ సంగతి చూడాలంటూ స్థానిక రెవెన్యూ అధికారులకు బాధ్యత అప్పగించారు. రంగంలోకి దిగిన షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి ఆదివారం మరో వివరణ ఇచ్చారు. షేక్‌పేట మండలం సర్వే నంబర్ 403/పీలో టీఎస్ నంబర్ 1/పార్ట్ బ్లాక్-హెచ్, వార్డు 10లో ఉన్న స్థలం ప్రభుత్వానిదే అని, దీనిలో 2.20 ఎకరాల స్థలాన్ని జలమండలికి కేటాయించామని పేర్కొన్నారు. ఇటీవల శ్రీ రాధికా కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ హైకోర్టులో డబ్ల్యూపీ నంబర్ 26109 ఆఫ్ 2024 పేరుతో, డబ్ల్యూపీ 25951 ఆఫ్ 2024 పేరుతో రిట్ పిటిషన్లు వేశారని, ఈ కేసును విచారించిన హైకోర్టు స్టేటస్ కో మెయింటెన్ చేయాలంటూ ఈ ఏడాది సెప్టెంబర్ 20న తీర్పును ఇచ్చిందని పేర్కొన్నారు. మొత్తం 16 ఎకరాల స్థలం తమ ఆధీనంలో ఉందని, ఈ స్థలం చుట్టూ రేకులు ఉన్నాయని షేక్‌పేట తహసీల్దార్ వివరణ ఇచ్చారు.

సమాధానం లేని ప్రశ్నలు ఎన్నో..

నగరం నడిబొడ్డున ఖరీదైన ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైనట్టు స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ రెవెన్యూశాఖ ఇస్తున్న వివరణలు మరిన్ని అనుమానాలకు తావిస్తున్నాయి. జలమండలి నిర్మించిన ప్రహరీ పక్కనున్న స్థలంలో మూడు నెలల క్రితమే ప్రైవేటు వ్యక్తులు పాగా వేశారని, అంతకు ముందే పార్థసారథి అనే వ్యక్తికి అనుకూలంగా ప్రైవేటు వ్యక్తులు వేసిన కేసులో ఇంజంక్షన్ ఆర్డర్ ఇచ్చిన విషయాన్ని ‘నమస్తే తెలంగాణ’ బయటపెట్టినా రెవెన్యూ అధికారులు విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని గురించి పట్టించుకోకపోవడం గమనార్హం. ఈ స్థలం బయటనున్న రేకుల షెడ్లకు 15 రోజుల క్రితం ప్రభుత్వ స్థలమంటూ రెవెన్యూ అధికారులు రాయించడంతోపాటు బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. అయితే, వాటిని గంటల వ్యవధిలోనే కబ్జాదారులు తొలగించారు. ఈ విషయం తెలిసినా పాతఫోటోలనే పంపిస్తూ ఇప్పటికీ ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు ఉన్నాయని నమ్మించే ప్రయత్నాలు చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. నిత్యం వేలాదిమంది బంజారాహిల్స్ రోడ్ నంబర్ 10లో ప్రయాణిస్తుంటారు. వందలాదిమంది బసవతారకం క్యాన్సర్ దవాఖానకు చికిత్స కోసం వస్తుంటారు. ఈ స్థలం చుట్టూ ప్రైవేటు వ్యక్తులు రేకుల షీట్లు ఏర్పాటు చేసుకున్న విషయాన్ని వారందరూ గమనిస్తున్నారు. ఆ స్థలంలోకి వెళ్లేందుకు రెండు చోట్ల గేట్లను ఏర్పాటు చేసుకుని వాటికి సీసీ కెమెరాలు సైతం ఏర్పాటు చేసిన విషయం ఈ రోడ్డు మీద వెళ్లేవారందరూ గమనిస్తునే ఉన్నారు. రాత్రి పగలు అనే తేడాలేకుండా ప్రభుత్వ స్థలంలో కొందరు ప్రైవేటు వ్యక్తులు తిష్టవేసి కాపలా కాస్తున్నారని, పార్థసారథి అనే వ్యక్తికి చెందిన వాహనాలు, సామగ్రి కూడా లోపలే పెడుతున్నారని స్థానికులు చెబుతున్నా స్థలం తమ ఆధీనంలోనే ఉందంటూ రెవెన్యూ అధికారులు నమ్మించే ప్రయత్నం చేస్తుండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

విషయం బయటకు పొక్కడంతో..

‘నమస్తే తెలంగాణ’ పరిశీలనలో మరిన్ని వాస్తవాలు బయటకు వచ్చాయి. ఈ స్థలంపై సుమారు 10 ఏండ్ల నుంచి కన్నేసిన పార్థసారథి అనే ల్యాండ్ గ్రాబర్‌కు ఓ ప్రజాప్రతినిధి ఇటీవల అండగా నిలబడ్డారని, ఆయన అండతోనే ఉన్నత స్థాయిలో రెవెన్యూ అధికారుల వద్దకు ఈ వ్యవహారాన్ని తీసుకువెళ్లినట్టు తెలిసింది. నాలుగైదు నెలల క్రితమే ఈ స్థలాన్ని ఓ ప్రజాప్రతినిధి తనకు సన్నిహితులైన బిల్డర్లకు డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ చేయించారని విశ్వసనీయంగా తెలిసింది. డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ పొందిన సంస్థ పేరుతో ఇప్పటికే భవన నిర్మాణాలకు సంబంధించిన అనుమతుల కోసం జీహెచ్‌ఎంసీకి సైతం దరఖాస్తు చేసుకున్నట్టు సమాచారం. ఇటీవల వ్యవహారం మొత్తం బయటకు రావడంతో రెవెన్యూ అధికారులు ప్లేట్ ఫిరాయించారని, తమ పేర్లు బయటకు వస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించినట్టు సమాచారం. దాంతో జీహెచ్‌ఎంసీ అనుమతుల కోసం ఇవ్వాల్సిన ఎన్‌వోసీ జారీ చేయలేదని తెలిసింది. ఈ మొత్తం వ్యవహారాన్ని ముందుండి నడిపించిన పార్థసారథి మీద గతంలో పలు ప్రాంతాల్లో భూకబ్జా, ఫోర్జరీ కేసులున్నాయనే విషయం తెలియక ఓ ప్రజాప్రతినిధి కూడా ఈ వ్యవహారంలో అడ్డంగా ఇరుక్కున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి.

సర్వే నంబర్ 403/52లోనే అసలు మెలిక?

సుమారు 5 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఫోర్జరీ పత్రాలతో కాజేసేందుకు ఎన్నో ఏండ్లుగా ప్రయత్నిస్తున్న పార్థసారథి వ్యవహారంలో రెవెన్యూ అధికారులు అత్యంత చాకచక్యంగా వ్యవహరిస్తూ అండగా నిలుస్తున్నారని తెలిసింది. పార్థసారథి అనే వ్యక్తి తనకు 403/52 సర్వే నంబర్‌లో 5 ఎకరాల స్థలం ఉందని వాదిస్తున్నాడు. 1930 నుంచి ఉన్న లింక్ డాక్యుమెంట్లతో పాటు కొన్ని పత్రాలను ఫోర్జరీ చేయడంతో 2023లోనే పార్థసారథిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫోర్జరీ కేసు నమోదు కావడంతో అరెస్టయ్యాడు. రెవెన్యూ రికార్డుల్లో మాత్రం ఈ సర్వే నంబర్‌లో ఉన్న వ్యక్తుల గురించి ఎక్కడా లేదు. రెవెన్యూ అధికారుల వద్దకు ఎవరైనా వచ్చి 403/52 సర్వే నంబర్ గురించి వాకబు చేస్తే అది ప్రభుత్వ భూమి కాదని చెప్తున్నారు. దీంతో ఇదే విషయాన్ని ఇటీవల రెవె న్యూ అధికారుల వద్ద నుంచి నివేదిక రూపంలో తీసుకున్న పార్థసారథి అండ్ గ్యాంగ్ తనకు రెవెన్యూ క్లియరెన్స్ కూడా వచ్చిందని, తన సర్వే నంబర్‌లో ఉన్న 5 ఎకరాలు ప్రభుత్వానిది కాదని నమ్మిస్తూ పలువురి నుంచి కోట్ల రూపాయల అడ్వాన్స్‌లు తీసుకున్నట్టు ‘నమస్తే తెలంగాణ’ పరిశీలనలో తేలింది. ఈ మెలికను ఉపయోగించుకుని జీహెచ్‌ఎంసీలో అనుమతులు తెప్పించేందుకు బిల్డర్‌ను రంగంలోకి దింపినట్టు తెలిసింది. ఈ వ్యవహారాన్ని మరింత లోతుగా విచారించడంతో పాటు స్థలాన్ని స్వాధీనం చేసుకుని పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

పోలీస్ కస్టడీలో రాజన్న కోడెల నిందితులు

- రెండు రోజులుగా కొనసాగుతున్న విచారణ
- ఆలయ అధికారులు, సిబ్బంది ప్రమేయంపై ఆరా!

గీసుగొండ, డిసెంబర్ 22 : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయ కోడెలను రైతుల పేరిట తీసుకొచ్చి కబేళాలకు విక్రయించిన ముగ్గురు నిందితులను పోలీసులు మూడు రోజుల విచారణ నిమిత్తం శనివారం కస్టడీలోకి తీసుకున్నారు. ప్రధాన నిందితులైన గీసుగొండ మండలం మనుగొండ ప్రాంతానికి చెందిన మాదాసి రాంబాబు, అనంతారాం గ్రామానికి చెందిన మంద స్వామి, దుగ్గొండి మండలం చలపర్తి గ్రామానికి చెందిన పసునూటి శ్యామ్‌సుందర్‌ను పోలీసులు విచారిస్తున్నారు. రాజన్న కోడెల వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారడంతో పోలీసులు అన్ని కోణాల్లో విచారిస్తున్నట్టు సమాచారం. ఈ వ్యవహారం ఎప్పటి నుంచి నడుస్తున్నది? ఎక్కడెక్కడ కోడెలను విక్రయించారు? ఎలాంటి ఆధారాలు చూడకుండా వాటిని వేములవాడ ఆలయ అధికారులు ఎలా ఇచ్చారనే కోణంలోనూ వారు విచారిస్తున్నట్టు తెలిసింది. రాజన్న ఆలయ అధికారులు, సిబ్బంది, గోశాల నిర్వాహకుల్లో ఎవరెవరి ప్రమేయం ఉన్నదనే విషయమై పోలీసులు వివరాలు రాబడుతున్నట్టు సమాచారం.

సీఎంను కలిసిన ఎంపీ అర్వింద్

హైదరాబాద్, డిసెంబర్22 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ఆదివారం ప్రత్యేకంగా కలిశారు. సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి సన్మానించారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌ను ఎంపీ అర్వింద్ వెంట తీసుకెళ్లడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మరోవైపు కాంగ్రెస్, బీజేపీ నేతలు బయటకు విమర్శించుకుంటున్నా ఒకరికొకరు సహకరించుకుంటున్నారని, అందుకు ఇదే ఘటన నిదర్శనమని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

పోలీసులను టచ్ చేస్తే వదలం

- బౌన్సర్ల చర్యలకు వీవీపీలదే బాధ్యత
- హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ హెచ్చరిక

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): యూనిఫామ్‌లో ఉన్న పోలీసులను టచ్‌చేస్తే బౌన్సర్లతోపాటు వారి ఏజెన్సీలను వదిలే ప్రసక్తే లేదని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ హెచ్చరించారు. సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటనపై ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. అల్లు అర్జున్‌కు సంబంధించిన బౌన్సలర్లు సంధ్య థియేటర్ వద్ద అతిగా ప్రవర్తించారని తెలిపారు. బౌన్సర్లు చట్టానికి వ్యతిరేకంగా ప్రజలపై దాడులు, బెదిరింపులకు పాల్పడితే.. క్రిమినల్ కేసులతో జైలు ఊచలు లెక్కించక తప్పదని హెచ్చరించారు. ఇక నుంచి వీఐపీ, వీవీఐపీలు తమ కార్యక్రమాలు నిర్వహించుకునే బౌన్సర్లు తీసుకునే చర్యలకు బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు.

కూలీలకు 12 వేలు ఇచ్చేదెట్లా?

- ఈ నెల 28న ఇస్తామన్న డిప్యూటీ సీఎం భట్టి
- ఎవరికి, ఎలా ఇస్తారనే దానిపై స్పష్టత కరువు
- ప్రజల్లో సవాలక్ష సందేహాలు

హైదరాబాద్, డిసెంబర్ 22(నమస్తే తెలంగాణ): భూమిలేని ఉపాధి హామీ రైతు కూలీలకు ఏటా రూ.12 వేలు ఇస్తామని కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చింది. 28 నుంచి కూలీలకు తొలి విడతగా 6 వేల చొప్పున ఇవ్వనున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు. ఈ ప్రకటనతో ప్రజల్లో అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కూలీలను ఏ ప్రాతిపదికన గుర్తిస్తారు? ఇందులో అర్హులను ఎలా ఎంపిక చేస్తారు? అందరికీ ఇస్తారా? లేక కోతలు పెడతారా? ఒకవేళ కోతలు పెడితే వారిని ఏ ప్రాతిపదికన అనర్హులుగా ప్రకటిస్తారు. అసలు ఇప్పటివరకు రాష్ట్రంలో ఎంత మంది కూలీలు ఉన్నారో తేల్చారా? వంటి అనే ప్రశ్నలు, సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పథకాల అమలులో కాంగ్రెస్ మార్క్ కోతలు, కొర్రీలు ఈ పథకంలోనూ కొనసాగుతాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఉపాధి కూలీలు 1.10 కోట్ల మంది

రాష్ట్రంలో 53 లక్షల ఉపాధి హామీ జాబ్ కార్డులు ఉన్నాయి. ఇందులో 1.10 కోట్ల మంది కూలీలు ఉన్నట్టు ప్రభుత్వ లెక్కలే చెప్తున్నాయి. హామీ మేరకు ఉపాధి కూలీలు 1.10 కోట్ల మందికి ఏటా రూ.12 వేల చొప్పున ఇస్తారా? లేదా? అన్న ప్రశ్నలు వస్తున్నాయి. దీనికి ఏటా 3,200 కోట్లు అవసరం అవుతాయి. రెండు దశల్లో ఆరు నెలలకు 6 వేల చొప్పున పంపిణీ చేసినా రూ.6,600 కోట్లు అవసరం అవుతాయి. ఇంత భారీ మొత్తాన్ని వెచ్చించి కూలీలకు సాయం అందిస్తుందా? అనే ప్రశ్నలు వినిస్తున్నాయి.

కౌలు రైతులకు ‘భరోసా’ లేనట్టేనా?

కూలీలకు, కౌలు రైతులకు, రైతులకు వీరిలో ఒకరికి ఒకే పథకం కింద సాయం అందుతుందని సీఎం రేవంత్ గతంలోనే ప్రకటించారు. భూమిలేని ఉపాధి కూలీలు ఓవైపు కూలీ చేసుకుంటూనే మరోవైపు భూమిని కౌలు తీసుకొని వ్యవసాయ చేస్తున్నారు. వీరిని ఏ విభాగంలో పరిగణిస్తారనేది ప్రశ్నగా మారింది. కౌలు రైతులకు ‘రైతు భరోసా’ ఇవ్వడం లేదనే చర్చ సాగుతున్నది. కౌలు రైతులను కూడా కూలీల విభాగంలో పరిగణించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలిసింది.

దీపం ఉన్నప్పుడే చక్కబెట్టేద్దాం

- ముఖ్యనేత కంటే ఆమె ప్రసన్నమే పవర్‌ఫుల్
- అమ్మ దయుంటే పోస్టులు, సీట్లు, టికెట్లు పక్కా
- నామినేటెడ్ పోస్టుల కోసం ప్రత్యేక కౌంటర్?

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): అమ్మ ఆశీర్వాదం కోసం ఆ పార్టీ నేతలు జూబ్లీహిల్స్‌కు పరుగులు పెడుతున్నారు. నామినేటెడ్ పోస్టుల్లో ముఖ్యనేత మాట కంటే ఆ అమ్మ ఆశీస్సులకే పవర్ ఎక్కువట. అమ్మ దయ ఉంటే నామినేటెడ్ పోస్టుల భర్తీ.. ఉద్యోగుల బదిలీలు ఏదంటే అది చకచకా జరిగిపోతున్నదని నేతలు బలంగా నమ్ముతున్నారట. పార్టీ ఆఫీసు వద్ద కన్నా అమ్మ ఇంటి వద్దే ఎక్కువ సందడి ఉంటున్నదని ఆ పార్టీ సీనియర్ నేతలే అంటున్నారు.

మూడు పోస్టులు.. ఆరు పైరవీలు

అంచెలవారీ నాయకత్వం కలిగిన ఆ పార్టీలో ఆమెది కీలక పదవి. సాధారణంగా అలాంటి స్థాయిలో ఉండేవాళ్లు.. పార్టీ బలోపేతం కోసమో, సమస్యలు చక్కబెట్టేందుకో అప్పుడప్పుడు ఢిల్లీ దూతగా వస్తుంటారు. కానీ ఆమె రూటే సెప‘రేటు.’ చేసుకోవడానికి ఇక్కడ చాలా ‘పని’ ఉన్నప్పుడు ఇక్కడే మకాం వేస్తేనే గిట్టుబాటు అవుతుందని అనుకున్నారేమో! అందుకే నెలకు రూ 6 లక్షల అద్దెతో జూబ్లీహిల్స్‌లో ఓ బంగ్లా తీసుకున్నారు. ఇక్కడే ఉండి పార్టీ పనుల్లో తలమునకలయ్యారని అనుకుంటే పొరపాటే. అమ్మగారు హైదరాబాద్ కేంద్రంగా సమాంతర పాలన నడిపిస్తునారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఆమె ఇంటి వద్ద రోజూ కనిపించే సందడే ఇందుకు నిదర్శనమని సొంత పార్టీకి చెందిన ఓ సీనియర్‌నేత వ్యాఖ్యానించారు. పార్టీలో ఇప్పుడంతా ఆమె మాటే నడుస్తున్నదని, ఆమె దయ ఉంటే పనులు సులువుగా జరుగుతాయని తెలిపారు. అమ్మగారిని కలసి ‘ప్రసన్నం’ చేసుకున్న వారికి పదవులు దక్కేలా సహకరిస్తారని, లేకపోతే కొర్రీలు పెట్టి అడ్డుకుంటారని వాపోయారు. రోజూ ఆమె ఇల్లు లాబీయిస్టులతో కిటకిటలాడుతున్నది. పదవులైనా, పైరవీలైనా, పోస్టులైనా, బదిలీలైనా కేరాఫ్ జూబ్లీహిల్స్ అన్నట్టు తయారైందని, రోజూ మూడు పోస్టులు, ఆరు పైరవీలుగా సమాంతర పాలన నడుస్తున్నదని వివరించారు.

అమ్మ ఆశీర్వాద బలం

రాష్ట్రంలో ఏ నిర్ణయం తీసుకోవాలన్నా అధిష్ఠానం ప్రతినిధి అభిప్రాయం తీసుకోవడం ఆ పార్టీలో తప్పనిసరి. వివాదాస్పదమైన వ్యక్తి, లెక్కలేనితనంతో వ్యవహరించే ఓ నాయకుడికి ఆ మధ్యకాలంలో ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వొద్దని ఇక్కడి నేతలు అంతర్గత నిర్ణయం తీసుకున్నారట. విషయం తెలిసిన సదరు వ్యక్తి నేరుగా అమ్మగారిని కలసి, ‘ప్రసన్నం’ చేసుకొవటంతో ఇక్కడి వాళ్లతో సంబంధం లేకుండా నేరుగా అక్కడి నుంచి టికెట్ ఇప్పించారని ప్రచారం జరిగింది. లోక్‌సభ ఎన్నికల్లో మెదక్ జిల్లాలో ఒకరికి, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మరొకరికి అమ్మగారే టికెట్ ఇప్పించారని తెలిసింది.

నామినేటెడ్ గిరాకీ.. స్పెషల్ కౌంటర్?

నామినేటెడ్ పోస్టుల భర్తీ సీజన్ త్వరలో మొదలు కానుందని ఆ పార్టీలో ప్రచారం జరుగుతున్నది. ఇంకేముంది ఆశావహులు ఆమెను ‘ప్రసన్నం’ చేసుకునే పనిలో పడ్డారు. ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రుల సిఫారసు లేఖలు ఉన్నా లేకున్నా, ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం పని చేసినా చేయకపోయినా.. ఇవేమీ అమ్మగారి దృష్టిలో పెద్ద విషయాలు కాదట. అమ్మవారికి ముడుపులు కట్టి ప్రసన్నం చేసుకుంటే పోస్టులు ఇప్పిస్తున్నారని సొంత పార్టీ నేత బహిరంగంగానే చెప్తున్నారు. అమ్మవారి సన్నిధానంలో పోస్టు స్థాయిని బట్టి దర్శనం టోకెన్లు తీసుకోవాల్సి ఉంటుందని చమత్కరిస్తున్నారు. వీటి ధరలు రూ.25 లక్షల నుంచి కోట్లలో ఉంటాయని తెలిపారు. వాస్తవానికి పార్లమెంట్ ఎన్నికల ముందు నామినేట్ పోస్టులను భర్తీ చేయాలని ఆ పార్టీ స్థానిక పెద్దలు భావించారని, ఆ విషయంలో ఆమె జోక్యం చేసుకోవడం వల్ల పదవుల భర్తీ పదే పదే వాయిదా పడుతూ వస్తున్నదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటువంటి ఆరోపణలు చేస్తున్నది చిన్నాచితకా స్థాయి నేతలు కాదు. కీలక పదవుల్లో నేతలే అమ్మగారి లీలల గురించి సన్నిహితుల వద్ద చెప్పుకుంటూ వాపోతున్నారట. ఇటీవల నోటి దురుసుతో వివాదాల్లో చిక్కుకున్న ఓ మంత్రి పదవి ఊడిపోవడం ఖాయమని ప్రచారం జరిగింది. కానీ జూబ్లీహిల్స్ అమ్మగారిని అనుగ్రహం ద్వారా అధిష్ఠానం ఆగ్రహం నుంచి సదరు మంత్రి ఉపశమనం పొందారని తెలుస్తున్నది.

కమీషన్ తక్కువ.. సర్వీస్ ఎక్కువ

రాష్ట్రంలో ముఖ్యనేతకు సమాంతరంగా మరో పవర్ సెంటర్‌గా మారుతున్నప్పటికీ కీలక నేతలు కూడా నోరుమెదపలేని పరిస్థితి నెలకొన్నదని ఆ పార్టీ నేతలు వాపోతున్నారు. పాలనలోనూ తలదూర్చుతూ ఉంటే ఇంకా ఏం మాట్లాడుతామని నిర్ఘాంతపోతున్నారు. ఐఏఎస్, ఐపీఎస్‌లకు ఫోన్ చేసి, “పని ఎంతవరకు వచ్చింది? త్వరగా పూర్తి చేయండి?” అంటూ అమ్మగారు ఆర్డర్లు వేస్తున్నారట. ఉద్యోగుల బదిలీల్లోనూ ఆమె జోక్యం చేసుకోవడం పరిపాటిగా మారిందని తెలుస్తున్నది. ముఖ్యంగా కాంట్రాక్టర్లు జూబ్లీహిల్స్ అమ్మ దగ్గరకు వెళ్లి, “పెండింగ్ బిల్లులు మంజూరు అయ్యేలా కరుణంచండి మాతా” అని వేడుకుంటున్నారట. సాధారణంగా బిల్లులు ఇప్పించే పనులను ముఖ్యనేత, ముఖ్యనేత అనుచరులు, కొందరు కీలక మంత్రులు 8 నుంచి 10శాతం కమీషన్ తీసుకుని చేస్తారని ప్రచారం ఉంది. కానీ అమ్మ సన్నిధానంలో మాత్రం 4 నుంచి 6శాతం దక్షిణ సమర్పించుకుంటే సరిపోతుందని తెలుస్తున్నది. కష్టమర్ల నుంచి గిరాకీ తీసుకురావడానికి ప్రత్యేకంగా ఓ భక్త బృందాన్ని కూడా అమ్మగారు ఏర్పాటు చేసుకున్నట్టు పార్టీ ఆఫీసు వర్గాల్లో బహిరంగానే చర్చ జరుగుతున్నది.

మోటకొండూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు అసమ్మతి సెగ

- మోటకొండూర్‌లో యూత్ కాంగ్రెస్ ర్యాలీ

యాదగిరిగుట్ట, డిసెంబర్22 : యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తీరుపై యూత్ కాంగ్రెస్ శ్రేణులు భగ్గుమంటున్నాయి. కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరబోయిన మల్లేశ్ యాదవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బీర్లకు వ్యతిరేకంగా పోటీలో నిలిచి గెలిచిన జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంగ ప్రవీణ్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా గెలుపొందిన బుగ్గ శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆదివారం మోటకొండూరులో సన్మాన కార్యక్రమంతోపాటు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ బీర్లను ఆహ్వానించలేదు. ఆయన వర్గమని చెప్పుకునే ఇతర నాయకులను సైతం యూత్ కాంగ్రెస్ పక్కనపెట్టింది. ఫ్లెక్సీలో ఎమ్మెల్యే ఫొటోలేకుండా చేశారు. ఎమ్మెల్యే అయిలయ్య సీనియర్ యూత్ కాంగ్రెస్ శ్రేణులను విస్మరించి పార్టీకి సంబంధం లేనివారిని అందలమెక్కిస్తున్న తీరును యూత్ విభాగం తప్పుబట్టింది.

చీరల పథకం ఉత్తముచ్చటే!

- బతుకమ్మ చీరల పథకానికి సర్కారు చరమగీతం
- ఎస్‌హెచ్‌జీలకు ఏటా 2 చీరలు ఇస్తామని హామీ
- ఏడాదైనా ఒక్క చీర కూడా పంచని కాంగ్రెస్ ప్రభుత్వం
- ప్రభుత్వంపై మహిళా సంఘాల తీవ్ర ఆగ్రహం
- ఉపాధి లేక నేతకార్మికుల అవస్థలు, ఆందోళన

హైదరాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మహిళల ఆదరణ పొందిన బతుకమ్మ చీరల పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం మంగళం పాడింది. బతుకమ్మ చీరలకు బదులుగా స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీ) మహిళలకు ఏడాదికి 2 చొప్పున చీరలు పంపిణీ చేస్తామని రేవంత్‌రెడ్డి సర్కారు హామీ ఇచ్చింది. కానీ ఏడాది గడిచినా ఒక్క చీర కూడా పంపిణీ చేయలేదని మహిళలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

డిజైన్లు చూశారట.. కానీ ఏమీ చెప్పలేదు!

రాష్ట్రంలో 63 లక్షల మంది ఎస్‌హెచ్‌జీ మహిళలకు ఏటా 2 చీరల చొప్పున 1.26 కోట్ల చీరలు పంచాలంటే పథకానికి రూ.400 కోట్లు అవసరం. సీఎం రేవంత్‌రెడ్డి చీరల డిజైన్లను కూడా పరిశీలించారంటూ అప్పట్లో కాంగ్రెస్ నేతలు ప్రచారం చేశారు. కానీ డిజైన్లు కూడా ఖరారు చేయలేదు. పథకంపై ఎలాంటి సమాచారం లేదని చేనేత, జౌళిమంత్రిత్వశాఖ అధికారులు స్పష్టంచేశారు. మహిళలకు నెలకు రూ.2500 పంపిణీ చేస్తామన్న హామీని కాంగ్రెస్ సర్కారు అటకెక్కించిందని, చీరల పంపిణీ పథకం పేరుతోనూ మోసం చేశారని మండిపడుతున్నారు.

మా గోడు వినిపించడం లేదా?

బతుకమ్మ చీరల పథకం రద్దుతో ఉపాధి కోల్పోయామని నేత కార్మికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సిరిసిల్లలో నేతన్నలు ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి వచ్చిందని బోరుమంటున్నారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో 25 మంది నేత కార్మికులు బలవన్మరణానికి పాల్పడ్డారు. గురువారం గణేశ్ అనే కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఉపాధి లేక అప్పుల భారంతో ఆత్మహత్య చేసుకుంటున్నట్టు లేఖ రాశాడు. సీఎం రేవంత్‌రెడ్డి పట్టించుకోవడం లేదని, పరిస్థితిపై సమీక్ష నిర్వహించడం లేదని చేనేత కార్మిక సంఘాల నేతలు మండిపడుతున్నారు.

సాగునీటిశాఖ ఇంజినీర్లపై సర్కారు వివక్ష!

- ఒకే వర్గానికి వంతపాడుతున్న ప్రభుత్వ పెద్దలు
- ఏండ్లుగా 5, 6 జోన్ల మధ్య సీనియారిటీ రగడ
- హైకోర్టు తీర్పు రిజర్వ్, అదనుగా సర్కారు కుట్రలు
- పదోన్నతుల నిలుపుదల, అయినవారికి అందలం
- ప్రభుత్వ తీరుపై సీనియర్ ఇంజినీర్ల ఆగ్రహం

హైదరాబాద్, డిసెంబర్ 22(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ ఏడాది పాలనపై నీటిపారుదలశాఖలోనూ తీవ్రమైన ఆగ్రహం వ్యక్తమవుతున్నది. ప్రభుత్వం పదోన్నతుల విషయంలో తీవ్రమైన వివక్ష చూపుతున్నదని సీనియర్ ఇంజినీర్లు మండిపడుతున్నారు. సమన్యాయం పాటించకుండా ఒకే వర్గానికి కొమ్ముకాస్తున్నారని నిప్పులుచెరుగుతున్నారు. అర్హులకు పదోన్నతులు ఇవ్వకుండా నచ్చినవారికి కీలక బాధ్యతలు అప్పగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై జలసౌధలో ఇంజినీర్లు ధ్వజమెత్తుతున్నారు.

అసలేం జరిగిందంటే!

నీటిపారుదలశాఖలో ఏండ్ల తరబడిగా జోన్-5, జోన్-6 ఇంజినీర్ల మధ్య వివాదం నెలకొన్నది. రాష్ట్రపతి పాత ఉత్తర్వుల ప్రకారం జోన్-6లోని ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్, నిజామాబాద్ జిల్లాల్లో ఎక్కువమంది ఇంజినీర్లు, జోన్-5లోని ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లో తక్కువ మంది ఇంజినీర్లు ఉన్నారు. దీంతో ఒకేసారి నియామకమైనప్పటికీ జోన్-6లోని ఇంజినీర్లు త్వరగా, జోన్-5లోని ఇంజినీర్లు ఆలస్యంగా ప్రమోషన్లు పొందుతున్నారు. ఈ వ్యవహారంపై నీటిపారుదలశాఖలో దశాబ్దాలుగానే వివాదం నెలకొన్నది.

నాడు పరిష్కారం.. నేడు గందరగోళం

ఉమ్మడి రాష్ట్రంలో ఇంజినీర్ల సమస్య పరిష్కారం కాలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత ఇంజినీర్లు అప్పటి సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేయగా ఆయన సానుకూలంగా స్పందించారు. కమిటీ ఏర్పాటు చేసి, సిఫారసుల ఆధారంగా 12 సూపర్ న్యూమరీ పోస్టులను క్రియేట్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కొందరు ఇంజినీర్లు కోర్టును ఆశ్రయించారు. తుదితీర్పునకు లోబడి ఉంటామని, కేసీఆర్ ప్రభుత్వం ఇంజినీర్లకు అడ్‌హాక్ ప్రమోషన్లు కల్పించింది. 839 మంది డీఈఈలకు ఈఈలుగా, 279 మంది ఈఈలకు ఎస్ఈలుగా, 75మంది ఎస్ఈలకు సీఈలుగా, నలుగురు సీఈలకు ఈఎన్సీలుగా పదోన్నతులు ఇచ్చింది. ఇన్‌చార్జి పోస్టులు లేకుండా హోదాకు తగ్గట్టుగా పేస్కేళ్లు పొందే అవకాశం కల్పించింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యను జఠిలం చేస్తున్నది. ఏడాదిలో 60మంది వివిధ హోదాల్లో కీలక ఇంజినీర్లు పదవీ విరమణ పొందారు. ఆయా స్థానాల్లో ఇతర సీనియర్లకు ప్రమోషన్లు కల్పించాల్సిన ప్రభుత్వం తమవారికి ఇన్‌చార్జీలుగా బాధ్యతలు అప్పగిస్తున్నదని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వమే వివక్షకు పాల్పడితే ఎవరికి చెప్పుకోవాలని ఇంజినీర్లు ప్రశ్నిస్తున్నారు. వివక్షను కొనసాగిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు.